త్యాగానికి ప్రతీక బక్రీద్: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా: త్యాగానికి ప్రతీక బక్రీద్ అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. నేడు బక్రీద్ సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతూ.. భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని సూచించారు. పేదలపై జాలి, దయ కలిగి ఉండడమే బక్రీద్ ఇచ్చే సందేశమని ఆయన పేర్కొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చెక్కులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని, అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అల్వాల్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అనిల్ కిషోర్‌గౌడ్, డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, పవన్, ప్రశాంత్‌రెడ్డి, రేవంత్ రెడ్డి, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ పండుగకు ఏర్పాట్లు



గౌతంనగర్‌లో అమ్మకానికి గొర్రెపోతులు, మేకపోతులు

గౌతంనగర్: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో మసీదులు సిద్ధమయ్యాయి. కుర్బానీ కోసం పలు ప్రాంతాల్లో గొర్రెపోతులు, మేకపోతుల అమ్మకాలు జోరందుకున్నాయి.

ఉత్తమ్‌నగర్ సమస్యలు పరిష్కరించాలని వినతి

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ ఉత్తమ్ నగర్‌లోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు శుక్రవారం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మేకల రాముయాదవ్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. రాముయాదవ్ మాట్లాడుతూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు విజయ్‌కుమార్, సాయికుమార్, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

అల్వాల్: నేరేడ్‌మెట్‌లోని శ్రీదేవి భూదేవి కళ్యాణ వెంకటేశ్వరస్వామి తృతీయ బ్రహ్మోత్సవాలు శ్రీబాలాజీ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. శుక్రవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, ఉదయం నుండి నిత్య సేవాకాలం, ద్వారా తోరణ ధ్వజ కుంభ ఆరాధన, మూలమంత్ర హవనం, ఆదిత్య హృదయ హవనం, మన్యుసూక్త హవనం, యాదశాల బలిహరణం, మహా పూర్ణాహుతి, 108 కలశాలతో స్వామివారికి శత ఘటాభిషేకం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుబ్బ మహేష్, అధ్యక్షుడు ఇల్లందుల సంతోష్, ప్రధాన కార్యదర్శి యంసాని శ్రీనివాస్, సాంబమూర్తి, ప్రవీణ్, జగదీశ్వర్, అర్చకులు మురళీధరాచార్యులు, శ్రీహరాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను అమలు చేయాలి

కాప్రా: కార్మికులు హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బీపీసీఎల్ ఆయిల్ సెక్టర్‌లో లారీ ట్యాంకర్ల డ్రైవర్లకు కనీస వేతనంతో పాటు 8 గంటల పని, ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలన్నారు. అనంతరం సీఐటీయూ అనుబంధంగా డ్రైవర్ల సంఘం ఏర్పాటుకు తీర్మానం చేయడంతో పాటు 13 మంది సభ్యులతో నూతన కమిటీని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా అశోక్, ఉపాధ్యక్షులుగా షరీఫ్, మల్లేశ్, సంయుక్త కార్యదర్శులుగా అంజి, నాగస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శిగా రాజిరెడ్డి, కోశాధికారిగా చెన్నకేశవ, కమిటీ సభ్యులుగా మహేశ్, గంగాధర్, కుమారస్వామి, నాగేందర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆసరా పింఛన్లు అందేదెన్నడో..?

ఏళ్లు గడుస్తున్నా మంజూరు కాని వైనం

- ఉప్పల్ సర్కిల్‌లో ప్రస్తుతం 9,429
- పెండింగ్‌లో 6,460 అర్జీలు



రామంతాపూర్ : వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, చేనేత కార్మికులు, గీత, బీడీ కార్మికులు, హెచ్ఐవీ ఎయిడ్స్ ఉన్న వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల ఆసరా సామాజిక పెన్షన్లు అందజేస్తోంది. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్, ఉప్పల్, హబ్సిగూడ, చిలుకానగర్ డివిజన్ల పరిధిలో ప్రస్తుతం 9,429 మంది ఆసరా పెన్షన్లు పొందుతున్నారు. అదేవిధంగా సర్కిల్‌లో నాలుగో డివిజన్‌లో సామాజిక ఆసరా పెన్షన్లకు 6,460 మంది 2022లో దరఖాస్తు చేసుకుంటే ఇప్పటికీ మంజూరు కాకా ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు.

చేయూత ఇవ్వరా..?

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆసరా పెన్షన్ల పేరును 'చేయూత'గా మార్చి ప్రజా పాలనలో ఉప్పల్ సర్కిల్ పరిధిలో దాదాపు 2,950 దరఖాస్తులు స్వీకరించింది. ఇందులో కొంతమందికి పెన్షన్లు ఇచ్చిన ఆ తర్వాత తీసుకున్న దరఖాస్తులపై ఎలాంటి కదలిక లేకుండా పోయింది. గత లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ముందు పెన్షన్లు మంజూరవుతాయని చాలామంది పేదలు ఎదురు చూశారు.కానీ నిరాశే ఎదురైంది. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో అధికారులు విచారణ చేపట్టినా ఇప్పటివరకు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు పట్టించుకుని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మూడేళ్లుగా చూస్తున్నాం..



2022లో ఆసరా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. కానీ ఇప్పటివరకు మంజూరు కాలేదు. ఉప్పల్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి చెప్పులు అరిగేలా తిరుగుతున్నా అధికారుల నుంచి సరైనా సమాధానం రావడం లేదు. పెన్షన్ రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం.

–సులోచన, గాంధీనగర్, రామంతాపూర్

మంజూరు చేయకుంటే ఆందోళనలు..



ఏళ్ల తరబడి ఆసరా పెన్షన్లు మంజూరు కాకపోవడంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజాప్రతినిధులు రాజకీయ నేతలు స్పందించి పెన్షన్లు మంజూరయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. లేకుంటే త్వరలోనే సీపీఎం రాష్ట్ర కమిటీతో చర్చించి సామాజిక పెన్షన్లు మంజూరయ్యే వరకు పోరాటాలు, ఆందోళనలను చేపడతాం.

– జె.వెంకన్న, కార్యదర్శి, ఉప్పల్ సర్కిల్ సీపీఎం

ఘనంగా ఎన్‌ఎఫ్‌సీ వార్షికోత్సవం



జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న డాక్టర్ గ్రోవర్

కాప్రా: హైదరాబాద్ ఈసీఐఎల్ సమీపంలోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్(ఎన్.ఎఫ్.సీ) వార్షికోత్సవాన్ని డీఏఈ కాలనీలోని డాక్టర్ హోమీజే బాబా కన్వెన్షన్‌లో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.బి.గ్రోవర్ హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో ఎన్ఎఫ్‌సీ అందిస్తున్న సేవలు కీలకమన్నారు. మిధాని, ఎన్ఎఫ్‌సీ మధ్య పరస్పర సహకారాన్ని వారు ప్రశంసించారు. అనంతరం ఎన్ఎఫ్‌సీ హైలైట్స్–2025 మ్యాగజైన్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో మిధాని చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీఎస్ నారాయణమూర్తితో పాటు ఎన్ఎఫ్‌సీ మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లు, రిటైర్డ్ సీనియర్ అధికారులు, యూనియన్ల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, కాలనీవాసులు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి కూకట్‌పల్లి జోనల్ కమిషనర్, ఇంజనీరింగ్ ఎస్ఈలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా కాలనీలకు సీసీ రోడ్లు మంజూరు చేయాలని, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని విన్నవించారు.

లక్ష సిందూరార్చన

మల్కాజిగిరి: వసంతపురి కాలనీ వల్లభ గణపతి దేవాలయం 30వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండోరోజు స్వామికి అభిషేకం, సహస్ర దుర్వార దళార్చనం, మహిళల సామూహిక లక్ష సిందూరార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం చివరిరోజు పూర్ణాహుతి, కుంభాభిషేకం, స్వామి ఉత్సవ మూర్తుల ఊరేగింపు జరుగుతాయని నిర్వాహకుడు మురళీధర్ తెలిపారు.



లక్ష సిందూరార్చనలో పాల్గొన్న మహిళలు

చర్లపల్లి రైల్వేస్టేషన్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

కాప్రా: చర్లపల్లి రైల్వేస్టేషన్‌ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం పరిశీలించారు. టెర్మినల్ పరిసర ప్రాంతాల్లో రోడ్లు, పార్కింగ్, వ్యాపార సముదాయాలు వంటి పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్‌లో సరైన వసతులు లేక ప్రయాణికులు, అలాగే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో వీధి దీపాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైల్వే స్టేషన్ మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవోదయనగర్ సంక్షేమ సంఘం ప్రమాణస్వీకారం

కాప్రా: మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ నవోదయనగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సింగపాక లింగం, ఉపాధ్యక్షుడిగా గొట్టె పోచయ్య, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల రాములు, సహాయ కార్యదర్శిగా కుందెళ్ల రాము, కోశాధికారిగా అశోక్, సహాయ కోశాధికారిగా శ్రీనివాస్, ఆర్గనైజర్లుగా బాలరాజు, లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులుగా చంద్రమౌళి, ప్రసాద్, నరసింహ, శేఖర్, పరశురాములు, నర్సయ్య, దేవయ్య, శ్రీను, కృష్ణ కనకయ్య, సిద్ధు, వెంకటేశ్, గణేశ్, సిద్దును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వంజరి ప్రవీణ్ కరిపె, జంపాల్‌రెడ్డి, భూపతి అశోక్, జయపాల్, హరినాథ్‌రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, లింగం, నవీన్, ఆనంద్ పాల్గొన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

కాప్రా: కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈసీఐఎల్‌లోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాంతి చర్చలు జరిపేలా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందని, అందులో భాగంగా ఈనెల 14న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు దామోదర్‌రెడ్డి, శంకర్ రావు, తోటపల్లి శంకర్, యాదగిరి, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌బీ కాలనీలో కారు దగ్ధం

కాప్రా: విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి కారు దగ్ధమైన ఘటన కాప్రా సర్కిల్ మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఓ కారు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద ఉన్న స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో షార్ట్‌సర్క్యూట్ కావడంతో కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు ఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. అయితే అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. కారులోని వారు బయటకు దూకడంతో ప్రాణాలతో బయటపడ్డారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

కాప్రా: మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ తిరుమలనగర్‌లో రూ. 18.50 లక్షల వ్యయంతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్‌తో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం సతీశ్, ఏఈ వేణుగోపాల్, స్థానిక నాయకులు మల్లేశ్, చంద్రశేఖర్, శ్రీనివాస్, అమరేంద్రబాబు, మురళీకృష్ణ, కృష్ణమోహన్, వెంకన్న, జైపాల్ నాయుడు, శేఖర్ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం



బ్యాడ్మింటన్ క్రీడాకారులతోఎమ్మెల్సీ కొమరయ్య తదితరులు

మల్లాపూర్: హోటిండియా స్పోర్ట్స్ క్లబ్, మల్కా బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన మేడ్చల్ జిల్లా బ్యాడ్మింటన్ 2025 పోటీలను ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంఆ వారు మాట్లాడుతూ.. ఈనెల 8వ తేదీ వరకు తెలంగాణ స్టేట్ సబ్ జూనియర్ మెన్, ఉమెన్ బ్యాడ్మింటన్ పోటీలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో రమేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సత్యారావు, కోశాధికారి వికాస్ హర్ష తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: నెహ్రూనగర్‌లో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అధికారులతో కలిసి శుక్రవారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, మహిళా భవన్ నిర్మాణం, శ్మశాన వాటికలో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ కాలనీవాసులు వినతిపత్రం అందించారు. సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ హామీనిచ్చారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం సతీశ్, ఇంజినీరింగ్ డీఈ రూప, స్థానిక నాయకులు ప్రవీణ్, చంద్రశేఖర్, రామాంజనేయులు, రమణ, శ్రీనివాస్, మధన్, నరేశ్, సురేశ్, రఘు పాల్గొన్నారు.

జడ్పీ పాఠశాలలో అంగన్‌వాడీ బాట-బంగారు బాట



మల్లాపూర్: స్థానిక జడ్పీ పాఠశాలలో అంగన్‌వాడీ బాట-బంగారు బాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. 2–5 ఏళ్లలోపు పిల్లలందరూ అంగన్‌వాడీలో చేర్పించాలని, అడ్మిషన్లు ప్రారంభమైనట్లు అంగన్‌వాడీ సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాణి, స్వరూప, కరుణ, మమత, రాణి, హిమబిందు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంపునకు అనూహ్య స్పందన



మాట్లాడుతున్న కమిషనర్ శైలజ



క్యాంపును ప్రారంభిస్తున్న కమిషనర్ త్రిల్లేశ్వర్ రావు

బోడుప్పల్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం ఐదో రోజు మేడ్చల్ జిల్లా ఆరోగ్య శాఖ, ఆర్‌బీఎం హాస్పిటల్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ డిజి స్కూల్‌లో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. బోడుప్పల్ కమిషనర్ శైలజ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. సిబ్బంది, స్టాఫ్ సుమార్ 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. ప్రతి 3 నెలల నుంచి 6 నెలల్లో క్యాంప్ నిర్వహించి ప్రత్యేక హెల్త్ ప్రొఫైల్ పుస్తకాన్ని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ఉమాగౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి, డీఈ చిరంజీవులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, సంగీత పాల్గొన్నారు.

పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో..

మేడిపల్లి: యూపీహెచ్‌సీ పీర్జాదిగూడ, మేడిపల్లి, పర్వతాపూర్ అభినవ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ త్రిల్లేశ్వర్ రావు మాట్లాడుతూ..పారిశుద్ధ్య కార్మిక సేవలు వెలకట్టలేనివని, వారు ఆరోగ్యంగా ఉంటేనే నగరపాలక సంస్థ పరిశుభ్రంగా ఉంటుందన్నారు. కార్మికుల సంక్షేమానికి నగరపాలక సంస్థ కృషి చేస్తోందని వారికి రావాల్సిన అన్ని సౌకర్యాల కల్పనకు, పీపీఈ కిట్స్ పంపిణీ చేస్తామన్నారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్, డీఈ సాయినాథ్ గౌడ్, మేనేజర్ క్రాంతికుమార్, కిశోర్‌కుమార్, ప్రవీణ్ కుమార్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ బాల మురళీకృష్ణ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక డ్రైవ్‌లో కార్పొరేటర్ రజిత

పారిశుద్ధ్యంపై అవగాహన

ఉప్పల్: హనుమసాయినగర్‌లో కార్పొరేటర్ మందుముల రజిత ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలు దరిచేరవన్నారు. అలాగే పలు ప్రాంతాల్లో శానిటేషన్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో నరేశ్ రెడ్డి బాకారం లక్ష్మణ్, తుమ్మల దేవిరెడ్డి, సల్లా ప్రభాకర్ రెడ్డి, ఖాజా, మౌలానా, అన్వర్ కంచమీది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

కాప్రా: చర్లపల్లి డివిజన్ కుషాయిగూడలో దోమల నివారణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాప్రా సర్కిల్ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, ఎల్బీనగర్ జోన్ సీనియర్ ఎంటమాలజిస్ట్ మాధవరెడ్డి, ఏఈ రమేశ్, నరేందర్, పరమేశ్, ఏఎంసీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి,నీరజరెడ్డి పాల్గొన్నారు.

పీర్జాదిగూడ బీజేపీ కమిటీ ఎన్నిక

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ పూర్తిస్థాయి కమిటీని శుక్రవారం ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు రాంపల్లి యాదగిరి గౌడ్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా బండి మహేశ్ యాదవ్, బీరండి మాధవీలత, తుపాకుల గోపాల్, అంబదాస్, ప్రధాన కార్యదర్శులుగా మల్లెల సంతోష్, కొండకింది వాసుదేవ రెడ్డి, కార్యదర్శులుగా పాశం సురేశ్, మద్దూరి చంద్రశేఖర్ రాజు, పద్మనాయక్, అనురాధా, కోశాధికారులుగా వెంకటేశ్, బుర్ర శ్రీనివాస్‌ను ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు తెలిపారు.

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఈస్ట్ జోన్..

బోడుప్పల్: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఈస్ట్ జోన్ బీజేపీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏర్పుల మహేశ్, ప్రధాన కార్యదర్శులుగా టి. ఆనంద్, బి. కిరణ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా జి. రాజు, ఎం. కిశోర్, జి. శరత్ చంద్రారెడ్డి, ఎం. రవి, కోశాధికారిగా హెచ్ నవీన్, కార్యదర్శులుగా డి. రాజిరెడ్డి, కాంతారెడ్డి, ఆర్. చంద్రశేఖర్, ఎ. సరళ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మహేశ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.



బడిబాట ర్యాలీలో పాల్గొన్న మండల విద్యాధికారి సురేష్




బాలికల పాఠశాలలో కార్పొరేటర్ శ్రవణ్

'బడిబాట' షురూ

మల్కాజిగిరి: మల్కాజిగిరి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం బడిబాట కార్యక్రమం ప్రారంభమైంది. మల్కాజిగిరి బాలికల పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి కార్పొరేటర్ శ్రవణ్ హాజరయ్యారు. మల్కాజిగిరి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు నిర్వహించిన ర్యాలీలో మండల విద్యాధికారి అంబటి సురేష్ పాల్గొన్నారు. ఈ నెల 19 వ తేదీ వరకు జరిగే బడిబాటను విజయవంతం చేస్తామన్నారు. పాఠశాలలకు రాకుండా చదువు మానేసిన విద్యార్థులను గుర్తించి వారిని తిరిగి బడికి వచ్చేలా చేయడమే లక్ష్యంగా పని చేస్తామని పేర్కొన్నారు.

మేడిపల్లిలో గ్రామసభ

మేడిల్లి: 'జయశంకర్ బడిబాట' లో భాగంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కమలానగర్ మేడిపల్లిలో శుక్రవారం గ్రామసభభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేసి బడీడు పిల్లలను స్కూల్లో చేర్పించాల్సిన బ్యాధత అందరిపై ఉందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.భాస్కర్, ఉపాధ్యాయులు, హెలీనా, మాధవి, జయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, చైల్డ్ వికాస్ ఫౌండేషన్ రమేశ్, మధ్యాహ్న భోజన సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.



చెట్టుకు ఉరేసుకొని యువకుడి మృతి

పోచారం: మద్యానికి బానిసైన ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జార్ఖండ్‌కు చెందిన అనూప్(29) ఉపాధి కోసం రెండు నెలల క్రితం బోడుప్పల్ వచ్చి ఓ టిఫిన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. తన జీతం డబ్బులను కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా మద్యం తాగడానికే ఖర్చు చేస్తూ భార్యతో గొడవపడేవాడు. శుక్రవారం ఉదయం నారపల్లిలో ఉంటున్న తన బావ దీపు గుప్తాకు ఫోన్ చేసి భార్యతో గొడవ పడ్డానని, ఆత్మహత్య చేసుకోవాలనే అనుకుంటున్నానని చెప్పాడు. దీపు వారించినా వినిపించుకోకుండా ఫోన్ కాల్ కట్ చేశాడు. అదే రోజు మధ్యాహ్నం జోడిమెట్లలోని యూనివర్సల్ బేకరీ వెనక ఉన్న వేపచెట్టుకు ఉరేసుకున్నాడు. దీపు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన

శామీర్ పేట్: శామీర్‌పేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో గోనె సంచులు ఇవ్వటం లేదని రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. సంచుల కోసం టోకెన్‌లు తీసుకుని తమకు నిర్దేశించిన సమయానికి కేంద్రం వద్దకు చేరుకున్నారు. అయినా సంచులు సరిపడా లేవని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. 226 మంది రైతులకు టోకెన్లను ఇచ్చిన అధికారులు వారికి సంచులు అందజేయడంలో విఫలమయ్యారు. సుమారు 8 వేల సంచులు అవసరంకాగా, 2,400 మాత్రమే అంటుబాటులో ఉన్నాయి. సహకార సంఘం చైర్మన్ మధుకర్ రెడ్డి ఉన్నతాధికారులకు ఫోన్ చేసి వెంటనే సంచులను తెప్పించి రైతులకు అందజేశారు. కార్యక్రమంలో రైతులు రాజిరెడ్డి, కొండల్ రెడ్డి, ప్రభాకర్, బాలమణి, సాయిలుయాదవ్, బుచ్చిరెడ్డి, మాధవ రెడ్డి, ఇంద్రారెడ్డి, రఘుపతి, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.